క్లుప్తంగా

విద్యుత్ చౌర్యం నేరం



విద్యుత్ చౌర్యంపై విలేకర్లతో మాట్లాడుతున్న అధికారులు

కారంచేడు: అక్రమంగా విద్యుత్ వినియోగించడం నేరమని పర్చూరు సబ్ డివిజన్ డీఈఈ ఎస్. రమేష్‌బాబు హెచ్చరించారు. చీరాల విద్యుత్ శాఖ ఈఈ ఆదేశాల మేరకు మండలంలోని కారంచేడు, స్వర్ణ సబ్‌స్టేషన్‌ల పరిధిలో 14 గ్రామాల్లో మంగళవారం సోదాలు నిర్వహించామన్నారు. అక్రమ విద్యుత్ వినియోగం, విద్యుత్ చౌర్యం వంటి 89 మందిపై కేసులు నమోదు చేసి.. రూ. 3.59 లక్షల జరిమానా విధించామన్నారు. అనంతరం ఆయన మండల కేంద్రమైన కారంచేడు కల్యాణ మండపంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఎక్కువగా ఓవర్‌లోడ్ వినియోగిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. చీరాల డీఈఈ డి. హరిప్రసాద్, వేటపాలెం డీఈఈ జె. శ్రీనివాసులు, బాపట్ల డీపీడీఈ అర్ విజయ్ శ్రీనివాస్, పర్చూరు, చీరాల, వేటపాలెం పరిధిలోని 9 మంది ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

షెడ్ మరమ్మతులు పూర్తి చేయండి



యద్దనపూడిలో సమావేశం నిర్వహిస్తున్న డీపీఓ ప్రభాకరరావు

యద్దనపూడి (కారంచేడు): గ్రామాల్లో నిరుపయోగంగా మిగిలిపోయిన ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లకు త్వరగా మరమ్మతులు చేయించి ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని బాపట్ల డీపీఓ ప్రభాకరరావు అన్నారు. మంగళవారం యద్దనపూడి పంచాయతీ పరిధిలో నిరుపయోగంగా మారిన హెడ్‌ను పరిశీలించారు. షెడ్‌కు అవసరమైన మరమ్మతులు చేయించాలన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పన్నుల వసూళ్ళపై రివ్యూ నిర్వహించారు. ఈ నెలాఖరు లోగా మీ పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన ఇంటిపన్నుల వసూళ్ళను ముమ్మరంగా చేపట్టాలని, నూరుశాతం లక్ష్యాలను సాధించేలా పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఈఓపీఆర్డీ పీటీవీ కృష్ణ, గ్రామ సర్పంచ్ వలేరు రేణుకమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వార్షిక బ్రహ్మోత్సవాలు



గరుడ ప్రసాదాన్ని భక్తులకు అందిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో వేంచేసియున్న శ్రీ వేదవల్లి, కనకవల్లి సమేత శ్రీ వీరరాఘవస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా మంగళవారం స్వామి వారికి 108 కలశాలతో అభిషేక కార్యక్రమాన్ని దేవాలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సంతానం లేని వారికి గరుడ ప్రసాదాన్ని అందించారు. అర్చకులు దిట్టకవి వాసుదేవాచార్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

పట్టణంలో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్ర

అద్దంకి: పట్టణంలో సింగిలియూజ్ ప్లాస్టిక్‌పై పూర్తి నిషేధం విధించినట్లు మునిసిపల్ కమిషనర్ రవీంద్ర చెప్పారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన పట్టణంలోని వివిధ దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా 3వ శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర డేగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దానిలో భాగంగా ఈ నెల 16 నుంచి సింగల్ యూజ్ ప్లాస్టిక్‌పై పూర్తి నిషేధం విధించినట్లు తెలిపారు. ప్లాస్టిక్ వలన మానవాళికి అంతులేని నష్టం కలుగుతోందని చెప్పారు. ప్రజలందరూ ప్లాస్టిక్‌కు బదులుగా తిరిగి ఉపయోగించుకోగలిగే వసుతులను దుకాణాల్లో అందుబాటులో ఉంచాలని.. గుడ్డ సంచులను వినియోగించాలని చెప్పారు.

అర్జీల విచారణ జాగ్రత్తగా చేయండి

చీరాల టౌన్: ప్రజలు, విద్యార్థులతో పాటు వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన అర్జీలను జాగ్రత్తగా విచారించాలని తహసీల్దార్ కె.గోపీకృష్ణ సూచించారు. తన కార్యాలయంలో మంగళవారం వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండలంలోని రెవెన్యూ గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరగా విచారణ చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం అందించే రెవెన్యూ సేవలను అందరికీ అందించాలన్నారు. వీఆర్వోలకు కేటాయించిన గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సేవలను సత్వరంగా అందించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ డి.అర్జున్, ఇన్‌చార్జి ఆర్‌ఐలు సత్యం, శేఖర్, వీఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు సరే.. నీరు ఎలా?




సిమెంట్ రోడ్డు నిర్మాణంతో వినియోగానికి అనువుగాలేని పంపు

చీరాల టౌన్: మండలంలోని బుర్లవారిపాలెం గ్రామ పంచాయతీ సాయికాలనీలో ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్డుకు మంచినీటి పంపు అడ్డుగా వచ్చిందేమో కానీ.. షాలో బోర్‌ను అలాగే ఉంచి రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో మంచినీటిని పట్టుకునేందుకు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. చేనేతలు, రోజువారీ కూలీలు అధికంగా నివసించే సాయికాలనీ తాగునీటికి షాలో బోర్లనే వినియోగిస్తుంటారు. అయితే చేతిపంపు వినియోగంలోకి లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో మంచినీటిని పట్టుకునేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

స్తంభాలు మార్చారు

సాక్షి ఎఫెక్ట్..

మేదరమెట్ల: 'ఇలా నిర్మిస్తే ఎలా' అనే శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. కొరిశపాడు మండలం ప్రాసంగులపాడు ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన మురుగు కాలువల్లో ఉన్న విద్యుత్ స్తంభాలను మంగళవారం తొలగించారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. కాలువల్లో ఉన్న విద్యుత్ స్తంభాలను పక్కకు జరపడంతో కాలనీ వాసులు సాక్షికి ధన్యవాదాలు తెలిపారు.



గతంలో కాలువలోనే ఉన్న స్తంభాలు (నాడు)



విద్యుత్ స్తంభాలను తొలగించి కాలువలు నిర్మించిన దృశ్యం

ఫీజు పోరు విజయవంతం చేయాలి

● వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్



ఫీజు పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

చీరాల: రాష్ట్రంలో విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టనున్న ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. మంగళవారం రామకృష్ణాపురంలోని క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన బకాయిలు పేరుకుపోయాయన్నారు. గత ప్రభుత్వం విద్యార్థులకు బాసటగా నిలిచిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారం చేపట్టి తొమ్మిది నెలలు పూర్తవుతున్నా అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 1000 కోట్లు విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కొన్ని కళాశాలల్లో ఫీజు కట్టకపోతే హాల్ టికెట్లు కూడా ఇవ్వని పరిస్థితి ఉందని, అప్పులు చేసి ఫీజులు కడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి మూడు నెలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తల్లుల బ్యాంకు ఖాతాల్లో వేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు చెప్పిన హామీలు నెరవేర్చలేదన్నారు. విద్యార్థులకు ఫీజు బకాయిలు విడుదలయ్యే వరకు వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందన్నారు.

ఫీజు పోరు పోస్టర్ ఆవిష్కరణ

బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న వైఎస్సార్ సీపీ ఫీజు పోరు కార్యక్రమ పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. బుధవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలో వైఎస్సార్ సీపీ.. ఫీజుపోరు నిరసన కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. బాపట్ల రథం బజారులోని పార్టీ జిల్లా కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, ఎస్సీసెల్ అధ్యక్షుడు వాసిమళ్ళ వాసు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సీతామహాలక్ష్మి, పట్టణాధ్యక్షుడు యాతం మేరిబాబు, బూత్ కన్వీనర్స్ నియోజకవర్గ అధ్యక్షుడు శిఖా సురేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత పక్షాన వైఎస్సార్ సీపీ పోరు



యువతపోరు వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి, నాయకులు

● యువత పోరు కార్యక్రమం వాల్ పోస్టర్ ఆవిష్కరణ

అద్దంకి రూరల్: యువత, నిరుద్యోగులు, విద్యార్థుల పక్షాన వైఎస్సార్ సీపీ ఉంటుందని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో యువత పోరు వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, వసతిదీవెనతో పాటు నిరుద్యోగులకు రూ. 3వేలు భృతి చెల్లించాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం యువత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, మండల కన్వీనర్‌లు, కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, వార్డు ఇన్‌చార్జిలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు చేయూత



ఉపాధి హామీ పథకం ద్వారా సాగు చేసిన నిమ్మతోట పరిశీలిస్తున్న ఏపీఓ సంతోషం

జె.పంగులూరు: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని పంగులూరు మండల ఏపీఓ కె. సంతోషం అన్నారు. ఏవీ విజయలక్ష్మి ఆదేశాలు మేరకు, ప్లాంటేషన్ మేనేజర్ పి. కిరణ్, ఏపీఓ సంతోషం.. ముప్పవరం గ్రామంలో ఇంటూరి గోవిందమ్మ సాగు చేసిన నిమ్మ తోటను మంగళవారం పరిశీలించారు. ఇంటూరి గోవిందమ్మ ఉపాధి హామీ పథకం ద్వారా అర ఎకరా భూమిలో నిమ్మతోట సాగు చేసిందని చెప్పారు. అర ఎకరం భూమికి రూ. 67 వేల ఎస్టిమేషన్ వేశామని, ఇప్పటికి రూ. 48 వేలు ఇచ్చామని అమె తెలిపారు. రూ.48 వేలతో గోవిందమ్మ నిమ్మతోటలో అంతర్గత పంటగా మినుము సాగు చేసిందని, రెండున్నర క్వింటాళ్ల మినుములు పండించిందని సంతోషం తెలిపారు. దీని ద్వారా అదనపు ఆదాయాన్ని కూడా గోవిందమ్మ పొందారని తెలిపారు. నిమ్మకాయల ద్వారా వారిని రూ. 7 వేలు ఆదాయం వస్తుందని, ఈ ఏడాది సుమారు నాలు నెలలుపాటు నిమ్మకాయలు కాస్తాయని తెలిపారు. ఈ లెక్కన నిమ్మకాయల అమ్మకంతో పాటు అంతర్గత పంట ద్వారా కలిపి మొత్తం ఏడాదికి రూ. 35 వేలు నుంచి రూ. 40 వేలు వరకు ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఉపాధి హామీ పథకం ఉపయోగించుకొని రైతులు ఉద్యానవన పంటను సాగు చేసుకొని మంచి లాభాలు పొందాలని తమె కోరారు.

దివ్యాంగుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

చినగంజాం: ఆర్థిక సహాయం కోసం దివ్యాంగులు వెలుగు కార్యాలయం నందు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎం సుబ్బారావు సూచించారు. మండలంలోని వెలుగు డీఆర్డీఏ ఆధ్వర్యంలో దివ్యాంగుల సమాఖ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఏపీఎం సుబ్బారావు మాట్లాడుతూ మండలంలోని దివ్యాంగులకు రైల్వే పాస్ కావాలంటే వారి ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, పాస్‌పోర్టు ఫోటో, ఫోన్ నంబర్, వైద్యుని ఉత్తరాలను వెలుగు కార్యాలయంలో అందజేయాలని వారికి రైల్వే పాస్ ఇప్పిస్తామన్నారు. చిరువ్యాపారాలు చేసుకోవడానికి చర్యలు తీసుకుంటామన్నారు. చెవిటి మిషన్‌లు కూడా అందిస్తామన్నారు. సమాఖ్య అధ్యక్షురాలు ఎం. విశ్రాంతమ్మ, వేణుబాబు, హనుమంతరావు, సీసీలు, స్వామి, శ్రీలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

చిన్నారులను తీర్చిదిద్దండి



బల్లికురవలో శిక్షణలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్

బల్లికురవ: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను ఆటపాటలతో, నైపుణ్యాలతో తీర్చిదిద్దాలని సూపర్‌వైజర్ పి. సలోమి పిలుపునిచ్చారు. పోషణ్ బీ, పఢాయి బీ శిక్షణలో భాగంగా మంగళవారం బల్లికురవలో కొణిదెన సెక్టార్ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమలో మాట్లాడారు. కార్యక్రమాన్ని దశల వారీగా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



మేదరమెట్లలో మెటీరియల్ అందిస్తున్న సీఐ మల్లికార్జునరావు

మేదరమెట్ల: మండలంలో పదో తరగతి విద్యార్థుల పరీక్షకు కావలసిన మెటీరియల్‌ను మేదరమెట్ల పోలీసులు మంగళవారం అందజేశారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు కావాల్సిన ప్యాడ్, పెన్నులను అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, మేదరమెట్ల ఎస్ఐ మహ్మద్ రఫీ అందచేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎలాంటి ఒత్తిడులకు గురికాకుండా ఏడాది పొడవునా చదివిన పాఠాలను గుర్తుకు తెచ్చుకొని పరీక్షలు రాయాలన్నారు. మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

కులవృత్తి సంఘాలతో నేడు సమావేశం

బల్లికురవ: కులవృత్తి సంఘాలకు నాణ్యమైన పరికరాలు అందించేందుకు బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నారు. ఈమేరకు ఎంపీడీఓ కుసుమ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బీమా ప్రీమియం చెల్లించండి



బల్లికురవలో బీమా చెక్కు అందజేస్తున్న చీఫ్ మేనేజర్

బల్లికురవ: బ్యాంకులో ఖాతా ఉన్న ప్రతి ఒక్కరు బీమా పథకాల ప్రీమియం చెల్లించాలని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు బల్లికురవ శాఖ చీఫ్ మేనేజర్ కె. సీనానాయక్ కోరారు. కొత్తపాలెం గ్రామానికి చెందిన ఏల్చూరి సునీత ఇటీవల చనిపోయారు. మంగళవారం ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజనలో రూ. 2 లక్షల చెక్కును ఆమె భర్త ప్రసాదరావుకు అందజేశారు. బ్యాంక్ అసిస్టెంట్ సుహిత గ్రేస్ బిందు మాధవి పాల్గొన్నారు.

హాల్‌టికెట్లు ఇవ్వకుంటే చర్యలు

చీరాల అర్బన్: ఫీజులు కట్టని విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వడం లేదని, పిల్లలను తరగతి గదిలో నిలబెట్టడంపై భాష్యం స్కూల్ యాజమాన్యంపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె భాష్యం స్కూల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులను శారీరకంగా కొట్టినట్లు తెలిస్తే యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీచైతన్య హైస్కూల్ విద్యార్థులతో మాట్లాడారు. ఫీజులు కట్టలేదని హాల్‌టికెట్లు ఇవ్వకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు ఉన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

చీరాల: చీరాలలోని ఏరియా హాస్పిటల్ అభివృద్ధిపై ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను మంగళవారం కలిసి విన్నవించారు. హాస్పిటల్ అభివృద్ధికి సహకరించాలని కోరడంతో మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో బడ్జెట్ నుంచి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఆప్కో చైర్మన్ డాక్టర్ సజ్జా హేమలత, మున్సిపల్ కౌన్సిలర్ మించాల సాంబశివరావు, అక్కయ్యపాలెం మాజీ సర్పంచ్ జంగిలి రాముడు తదితరులున్నారు.

ఘనంగా సామూహిక వ్రతాలు



సామూహిక సత్యన్నారాయణ వ్రతంలో దంపతులు

కారంచేడు: మండలంలోని స్వర్ణ గ్రామంలో కొలువైన అలివేలు మంగా పద్మావతీ సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం పెద్ద ఎత్తున సత్యన్నారాయణస్వామి వారి సామూహిక వ్రతాలను కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ 49వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని గత మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న విశేష పూజలు ముగిశాయి. చివరి రోజున స్వామివారు, అమ్మవార్ల విగ్రహాలను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సామూహిక వత్రాల్లో గ్రామానికి చెందిన సుమారు 50 మంది దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

షటిల్ క్రీడాకారులకు సన్మానం



క్రీడాకారులను సత్కరిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: జాతీయ స్థాయి షటిల్ పోటీలకు ఎంపికైన చీరాల క్రీడాకారులను మంగళవారం స్థానిక ఇండోర్ షటిల్ కోర్టులో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు రామకృష్ణ, ఐ.బాబూరావు, రమేష్ మాట్లాడారు. చీరాల ప్రాంతంలో క్రీడాకారులకు కొదువలేదన్నారు. జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులను సొంతం చేసుకున్నారన్నారని, వారికి ఎప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. 40 సంవత్సరాలుగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్న నాగేశ్వరరావు ఆదర్శమన్నారు. ఈనెలలో గోవాలో జరగనున్న జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికైన సీనియర్ క్రీడాకారుడు తుపాకుల నాగేశ్వరరావు, సుహాసిని, అంకాలు, సుమన్, కిరణ్మయిలను ఘనంగా సత్కరించారు. సుహాసినికి ఒకటో షటిల్ కోర్టు తరపున రూ.5వేలు సహాయాన్ని అందించారు. షటిల్ క్రీడాకారులు శ్రీనివాసమూర్తి, బట్ట మోహన్‌రావు, కేదార్నాథ్, సత్యనారాయణ, నాగరాజు, వీరనాగేశ్వరరావు, రాయుడు, దాసు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు పన్ను వసూలు చేయండి

చీరాల టౌన్: గ్రామాల్లో పెండింగ్ బకాయిలు, ఇంటి పన్నుల వసూళ్లను నెలాఖరు లోపు 100 శాతం చేయాలని ఈవోఆర్డీ రామకృష్ణ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. గ్రామాల వారీగా ఇంటి పన్నుల బకాయిలు పేరుకుపోవడంతో అభివృద్ధికి అడ్డంకిగా మారిందని అన్నారు. ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండాలంటే గ్రామాలన్నీ సుందరంగా ఉండాలని, పారిశుద్ధ్య నిర్వహణ పాటించాలన్నారు. ప్రతి పంచాయతీకి విధిగా ఫాగింగ్ యంత్రం వినియోగించి దోమల నిర్మూలన చర్యలు చేపట్టారు. గ్రామాల అభివృద్ధికి కార్యదర్శులు శ్రద్ధగా పని చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లున్నారు.

పర్చూరు(చినగంజాం): మండలంలోని గ్రామాల్లో ఇంటి పన్ను వసూలు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కేఎల్ ప్రభాకరరావు ఆదేశించారు. మంగళవారం స్థానిక వెలుగు సమావేశం హాలులో మాట్లాడారు. చెత్త సేకరణ కేంద్రాలైన ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్లను మరమ్మతులు చేయించాన్నారు. ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్, ఈఓపీఆర్డీ కె. సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాపు వర్గాలకు రుణాలు

అద్దంకి: చంద్రన్న స్వయం ఉపాధి పథకం ద్వారా బీసీ, ఈడబ్ల్యూఎస్ కాపు కులాల వారికి రుణాలు మంజూరు చేయనున్నట్లు మునిసిపల్ కమిషనర్ రవీంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దానికి సంబంధించి ఈ నెల 22 లోపు ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తులు పరిశీలన, 30న బ్యాంకర్ల సంయుక్త పరిశీలన చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు తమ సమీప సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మార్టూరు: మండలంలో శనగలు, మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని మార్టూరు వ్యవసాయ శాఖ ఏడీఏ కేవీ శ్రీనివాసరావు అన్నారు. రాజుపాలెం, డేగరమూడి రైతులతో మంగళవారం మాట్లాడారు. ఏవో బి. అంజిరెడ్డి, విస్తరణాధికారి రాధా క్రిష్ణ పాల్గొన్నారు.

నిరంతర శ్రమతో గుర్తింపు

చీరాల రూరల్: న్యాయవాద వృత్తిలో రాణించాలంటే నిరంతరం న్యాయపుస్తకాలను అభ్యసించాలని సీనియర్ న్యాయవాది ఆసాది రామకృష్ణారెడ్డి అన్నారు. చీరాల కోర్టు భవన సముదాయంలోని బార్ అసోసియేషన్ హాలులో మంగళవారం జూనియర్ న్యాయవాదులకు సివిల్ న్యాయ చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రమేష్‌బాబు, బోయిన శ్రీనివాసులు, కొటిక ఉదయ భాస్కరరావు పాల్గొన్నారు.